# అహంబ్రహ్మాస్మి

అద్వైతాశ్రమంలో చోరీ!

అది చోరీకాదు. ఆశ్రమవాసులకి అగ్నిపరీక్ష!

అందర్నీ కూర్చోపెట్టాడు అధ్యక్షుడు. సత్యం చెప్పమని నొక్కి అడిగాడు.

అంతా ఎరగమన్నారు!

హృదయాలు విప్పమన్నాడు—మళ్ళీ!

హృదయాలు విప్పడమేకాదు; పెట్టెలుకూడా తెరిచి చూపారు ఆశ్రమవాసులు.

పోయిన వస్తువులు దొరకలేదు.

"ఆశ్రమంలో వ్యక్తిగత ఆస్తి యేమీ వుండకూడదని ప్రతి సభ్యుడికీ తెలుసు. తెలిసికూడా శేషగిరి ఆ నియమాన్ని ఉల్లఘించాడు. అందుచేతనే భగవంతు డీవిధంగా అతన్ని శిక్షించాడు! భగవంతుడు సర్వశక్తివంతుడు. మానవమాత్రులకు అతనిలీలలు అర్థంకావు" అన్నాడు అధ్యక్షుడు.

ఆశ్రమవాసులంతా శేషగిరినే దొంగను చూసినట్టు చూశారు.

సాయంత్రం అధ్యక్షుడు భగవంతు నిలా ప్రార్థించాడు:

"సర్వేశ్వరా! నీలీల లతి విచిత్రములు. నీవే యీపనిని, శేషగిరికి జ్ఞానోపదేశమునకై చేసివుంటావు. నీవే ఆ సొమ్ము మరల నాకు చేర్చు. శేషగిరి అజ్ఞాని. అతని కింకా ధన వ్యామోహం వదలలేదు. అతన్ని క్షమించు."

శేషగిరి తన అజ్ఞానాన్ని ఒప్పుకుని, క్షమించమని భగవంతుణ్ణి ప్రార్థించాడు.

మర్నాడు అధ్యక్షుడు మామూలుగా ఉదయపు నడకకు వెళ్ళి వచ్చేవరకు ఆశ్రమంలో పోలీసులున్నారు. పోయిన వస్తువులు అధ్యక్షుడి పెట్టెలోనే దొరికినై. అధ్యక్షుడికి ఆశ్చర్యంకంటే ఆనందం యెక్కువ కలిగింది.

"భగవంతుడు భక్తలోలుడు. నేను కోరినవిధంగా నా వస్తువులు నాకు వప్పగించాడు?" అన్నాడు.

"స్వామివారు చెప్పిందంతా జరిగింది. భగవంతుడి మాయ మాబోటి మూఢులకేం అర్థమౌతుంది" అన్నాడు శేషగిరి.

భగవంతుడిమాయ తెలుసుకుని పోలీసులు, శేషగిరి వస్తువులు శేషగిరికి వప్పగించి వెళ్ళిపోయారు.

"ఈ ఘటన మీబోటి ఆధ్యాత్మిక విద్యార్థులకొక కఠిన ప్రశ్న. ఇప్పుడు భగవంతుడు యే రూపముతో రక్షకభటుల దగ్గరికి పోయివుంటాడో మీరు చెప్పగలరా?" అన్నాడు అధ్యక్షుడు.

ఆశ్రమవాసులికి భగవంతుడి రూపం అంతుబట్ట లేదు. అంతా శేషగిరివంక చూశారు.

"అంతకంటె కఠినమైన ప్రశ్న యింకొకటి వుంది. భగవంతుడు యే రూపంతో దొంగతనం చేసివుంటాడని మీ నమ్మకం?" అన్నాడు శేషగిరి.

ఆశ్రమవాసులకి యిదికూడా అంతుపట్టలేదు; అధ్యక్షుడి వంక చూశారు.

"కామరూపంతో. భగవంతుడు ఒకరిశరీరాన్ని ఆశ్రయిం చక్కర్లేదు" అన్నాడు అధ్యక్షుడు.

"బహుశా అదేరూపంతో పోలీసులికికూడా రిపోర్టుచేసి ఉంటాడు" అన్నాడు శేషగిరి.

అధ్యక్షుడు నొచ్చుకున్నాడు.

"సర్వేశ్వరా! నీ లీల లతి విచిత్రములు! నేనెంత అజ్ఞానినో నువ్వు శేషగిరి రూపంతో రుజువుపర్చావు. శేషగిరి ఆధ్యాత్మిక విద్యలో నాకంటె గొప్ప. అతను నాదగ్గర నేర్చుకునేది యింకేమీ లేదు" అని ప్రార్థించాడు అధ్యక్షుడు.

"సర్వేశ్వరా! నీ అవ్యాజకృపవల్ల నేను వారంరోజులకే గురువుగారిని మించిపోయాను. ఐనా నా జీవితమంతా వారినే గురువుగా ఎంచుకుంటాను. దయానిధీ! నీవు నాలోనే కాదు, గురువు గారిలో కూడా విరాజిల్లు తున్నావు" అని ప్రార్థించాడు శేషగిరి.

అదే శేషగిరి ఆఖరి ప్రార్థన.

ఆనాటి సాయంత్రమే ఆశ్రమం వదలిపెట్టాడు శేషగిరి— గురువుగారి సెలవూ దీవనలూ పొంది.